క్లుప్తంగా

వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి కేజీబీవీ పాఠశాలలో బుధవారం తపాలాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు చేతిరాత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. హైదరాబాద్ పోస్టల్ సర్కిల్, జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి వేర్వేరుగా నగదు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధి సందీప్‌కులకర్ణి తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అల్లాదుర్గం(మెదక్): ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఉపాధిహామీ ఉద్యోగులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, టీఏలున్నారు.

అన్ని గ్రామాల్లోనూ పథకాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు పథకాలను అన్ని గ్రామాల్లోనూ అమలు చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, రమేశ్‌గుప్తా, లక్ష్మణ్, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, అర్జున్, తదితరులు ఉన్నారు.

కార్మికులకు సన్మానం


కార్మికులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం జిల్లా సామాజిక సమరసత జిల్లా ఆర్గనైజర్ భైరం నర్సింలు ఆధ్వర్యంలో సన్మానించారు. అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మెదక్ మున్సిపల్ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో ఎస్సీ పరిరక్షణ జిల్లా అధ్యక్షులు బైండ్ల రాంచేంద్రం, బీజేపీ నాయకులు సత్యనారాయణ, కాశీనాథ్ తదితురులు పాల్గొన్నారు.

ఆటంకం కలిగిస్తే చర్యలు


ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ అధికారులను దూషించినా.. విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తప్పవని నర్సాపూర్ ఎస్‌ఐ లింగం బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన గ్రామసభల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను అసభ్యకర పదజాలంతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు కలిసి ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు తప్పనిసరి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాక్టికల్ పరీక్షలకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని నార్సింగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్ అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 30న ఉదయం పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందని, 31న ఆంగ్ల పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1న ఆంగ్లం ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలకు హాజరుకాని విద్యార్థులు, వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా ఫలితాలు విడుదలకావన్నారు.

మంజీరా నదిలో.. మాఘస్నానాలు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ శివారులోని మంజీర నదిలో భక్తుల స్నానాలు


అల్లాదుర్గంలో ఎల్లమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు


కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మాఘ అమావాస్యను పురస్కరించుకొని మంజీరా నదిలో స్నానమాచరించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. బుధవారం మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న చాముండేశ్వరీ ఆలయానికి సమీపాన మంజీరా నది ఉండటంతో, పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో అమ్మవారి దర్శనార్థం వచ్చిన వారు క్యూలైన్‌ల్లో వేచి ఉండాల్సి వచ్చింది. అర్చకులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వీరభద్ర ఆలయంలో..

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని వీరభద్ర, రేణుకా ఎల్లమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వీరభద్ర దేవాలయంలో భక్తులు పూజలు చేసి అన్నదానం స్వీకరించారు.

రామాయంపేట(మెదక్): పట్టణంలోని లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామ శివారులలోని కాలభైరవస్వామికి బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి భస్మాభిషేకం చేసి కూష్మాండ దీపారాధన చేశారు. వివిధ గ్రామాల భక్తులు పూజలు చేశారు. దీంతో పాటు మండలంలోని రాజిపేటలో శివారులోని సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, శివస్వాములు దేవతామూర్తులకు దర్శించుకున్నారు.

కొప్పోల్ కోనేటిలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎస్‌ఐ శంకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేరూర్ సరస్వతీ మంజీరా వద్ద..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం మంజీరా నది పక్కన వెలసిన పేరూర్ గ్రామ శివారులోని సరస్వతి ఆలయం వద్ద మంజీరాలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకుడు రాజమౌళిశర్మ ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

తుక్కాపూర్ శివారులో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్న ఘనపూర్ వైపుగల వనదుర్గ ప్రాజెక్టు కింద అదేవిధంగా పోతంశెట్టిపల్లి, చిన్నఘనాపూర్ శివారు ఏడుపాయల వనదుర్గాదేవి సన్నిధికి వెళ్లే టేకులగడ్డ, ఉరవగడ్డ సమీపంలోని మంజీరా నదిపాయల్లో భక్తులు మాఘస్నానాలు చేశారు. మరోవైపు తుక్కాపూర్ శివారులోని మంజీరా నదిలో సైతం స్నానాలు ఆచరించారు.


కొప్పోల్ ఆలయ కోనేటిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


హవేళిఘణాపూర్(మెదక్): మంజీరాలో భక్తుల పుణ్యస్నానాలు


ఏడుపాయల టీ జంక్షన్ సమీపంలోని నది పాయలో..

బగలాముఖీ ఆలయంలో భక్తుల సందడి


ప్రత్యేక అలంకరణలో బగలాముఖీ అమ్మవారు


హోమంలో పాల్గొన్న భక్తజనం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ ఆలయానికి బుధవారం భక్తజనం పోటెత్తారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం, హరిద్వార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అటవీ అభివృద్ధి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దంపతులు, మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా దర్శించుకున్నారు. ఆలయ భూదాత రమేశ్ గుప్తా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సూర్యంగౌడ్, పోచగౌడ్, వెంకటేశ్, కొండల్, వరగంటి రమేశ్, అశోక్, నాగరాజు, తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మనోహరాబాద్(తూప్రాన్): మాఘ అమావాస్యను పురస్కరించుకొని పలు గ్రామాల్లో దేవాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. మండల కేంద్రంలోలో పోచమ్మ అమ్మవారికి యువకులు పూజలు చేశారు. అనంతరం గోవులకు గ్రాసం అందజేశారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డి, రాజిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, యూత్ నాయకులు డిష్ రాజు, ల్యాబ్ రవిలతో పాటు పలు గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్ రాములుగౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

పదో తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 4న జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌పీ) నాయకులు ప్రభు, మల్లారెడ్డి, నాగేందర్, కృష్ణ తెలిపారు. బుధవారం డీఈఓ రాధాకిషన్ కలిసి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈనెల 30న పాఠశాల స్థాయి, 31న మండలస్థాయిలో నిర్వహించి, ఫిబ్రవరి 4న జిల్లాస్థాయిలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.


డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కేఎస్‌ఆర్‌ఎస్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో కోలపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 161 జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ట్రక్కు, లారీ డ్రైవర్లకు, కారు డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై పాటించాల్సిన నియమ నిబంధనల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఈ రెహమాన్ ఖాన్, ఎస్పీపీఎల్ ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్, ఇన్సిడెంట్ మేనేజర్ ఖాజా మొయినుద్దీన్, సేఫ్టీ మేనేజర్ బాలరాజు, పోలీస్ సిబ్బంది, ఐఎంఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టేక్మాల్(మెదక్): విశ్రాంతి ఉద్యోగుల కోసం నిర్వహించే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు బుధవారం తెలిపారు. మెడివిజన్ ఆస్పత్రి సౌజన్యంతో మెదక్ ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాములు

చిన్నశంకరంపేట(మెదక్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం గజగట్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ వివరాల ప్రకారం... మండలంలోని గజగట్లపల్లి గ్రామానికి ముంద్రాతి చిన్న రాములు(50) సోమవారం గవ్వలపల్లిలో సంతకు వచ్చాడు. కూరగాయాలు తీసుకొని గజగట్లపల్లి గ్రామానికి ఆటోలో వెళ్తుండగా సంగాయిపల్లి మూలమలుపు వద్ద బైక్‌ను ఢీకొని ఆటో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కూతురు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

31న ప్రజాదర్బార్

రామాయంపేట(మెదక్): ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజాదర్బార్ ఈనెల 31న స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద జరుగుతుందని ఎంపీడీఓ సజీలుద్దీన్ తెలిపారు. ఈఏడాది చేసిన ఉపాధి పనులకు ఈనెల 25 నుంచి 31 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమం కొనసాగిందన్నారు.

ఖర్గే వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా


టేక్మాల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): కుంభమేళా గంగా నదిలో మునిగితే పేదరికం పోతుందా అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికా అశోక్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎవరి సొంత డబ్బులు వారు పెట్టుకొని పోయి గంగా నదిలో పుణ్యస్నానాలు చేస్తుంటే తమకేందుకంటూ మండిపడ్డారు. కుంభమేళాకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వెళ్తుంటే మీకు వచ్చిన నష్టం ఏంటని, మీరు ఒక హోదాలో ఉండి మీ కార్యకర్తలకు నేర్పిస్తున్నది ఇదేనా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన ఖర్గే భక్తులకు క్షమాపణ చెప్పాలన్నారు.

మంజూరు పత్రాల రికవరీ

అనర్హులకు మంజూరైన సంక్షేమ పథకాలు రద్దు: ఎంపీడీఓ చంద్రశేఖర్


మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ ఉపాధ్యాయుడి కుటుంబానికి, విద్యార్థికి ఆత్మీయ భరోసా అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు అనర్హులకు మంజూరైన సంక్షేమ పథకాలపై పూర్తి స్థాయి విచారణ చేశారు. అనర్హులకు మంజూరైన సంక్షేమ పథకాలను రద్దు చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుడి తల్లికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు విచారణలో తెలిందని, ఆమెకు ఇచ్చిన మంజూరు పత్రంను రికవరీ చేశామన్నారు. ఉపాధ్యాయుడు స్థానికంగా ఉండకపోవడంతో, ఇళ్లు మంజూరుకు దరఖాస్తు పెట్టుకుంటే తప్పుడు సమాచారంతో ఇళ్లు మంజూరైనట్లు వివరించారు. ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆత్మీయ భరోసా మంజూరు కాలేదన్నారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థికి ఆత్మీయ భరోసా మంజూరయిందని, గతంలో జాబ్ కార్డు ఉండటం, భూమి లేకపోవడంతో ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు ఏపీఓ సుధాకర్ చెప్పారు. విద్యార్థికి మంజూరైన ఆత్మీయ భరోసాను ఓల్డ్‌లో పెట్టామన్నారు. అనర్హులకు మంజూరైన సంక్షేమ పథకాల్లో మండలస్థాయి అధికారుల ప్రమేయం లేదన్నారు. గ్రామ సభలో పేర్లు చదివిన ఎవరు మా దృష్టికి తెలేదన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రొటోకాల్ విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రవినాయక్, ప్రభులింగంగౌడ్, గణేశ్, మల్లేశ్, నాగభూషణం, సత్తయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజుగౌడ్, ఆంజనేయులు, సోనుతో పాటు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎస్సీలకు పదవులు కేటాయించాలి**



కొల్చారం(నర్సాపూర్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులను మాదిగలకు కేటాయించాలని బుధవారం మాల, మాదిగ ఉపకులాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తుడుము రామకృష్ణ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్, యోహాన్, కిష్టాపూర్ మాజీ ఉపసర్పంచ్ గోదావరి ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడుతూ.. మండలంలో ఎస్సీలు ఇంతవరకు పదవులు పొందకపోవడం నాయకుల లోపమా? అధికారుల లోపమా అంటూ ప్రశ్నించారు. అంబేడ్కర్ రాసినటువంటి రిజర్వేషన్లకు తూట్లు పొడిచేలా రాజకీయ నాయకులు పనిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఎల్లేశం, ఆదాము, రమేశ్, దేవదాసు, బాబయ్య ప్రవీణ్, సంజీవయ్య మహేశ్, పద్మయ్య జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేటి నుంచి బీరప్పస్వామి జాతర**

టేక్మాల్(మెదక్): గొల్ల కురుమల ఆరాధ్య దైవం బీరప్పస్వామి జాతర ఆలయం ముస్తాబైంది. జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 07 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. 30న మంద పోచమ్మకు, 31న మైలబోనం తీయుట, ఫిబ్రవరి 1న గంగకు వెళ్లుట, 2న బీరప్పస్వామికి బోనాల ఊరేగింపు, 3న బీరప్పస్వామి కామరాతి కల్యాణం, 4న నాగవెళ్లి, 5న పాలు పొంగిచుట, సల్లలు చేయుట, 6న బొబుగొండకు బోనాల ఊరేగింపు, 7న కడపలు కడుగుట బీర్లవారు వెళ్లిపోవుట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

◆ **కనులపండువగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఫిబ్రవరి ఏడు వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. సాయంత్రం స్వస్తివాచనం, రక్షాబంధనం, అంకురారోహణ నిర్వహించారు. 30న చతుస్థానార్చనలు, అగ్నిప్రతిష్ఠ ధ్వజారోహణం, ధ్వజ కుంభారాధన, విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం శేష వాహనసేవ, 31న శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజియర్‌స్వామి పర్యవేక్షణలో ఉదయం సామూహిక లక్ష్మీనారాయణ పూజలు, కల్పవృక్ష వాహనసేవ నిర్వహించనున్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వివరించారు.

◆ **మూడు నెలలుగా వేతనాలు లేవు**



చిన్నశంకరంపేట(మెదక్): తమకు మూడు నెలలుగా వేతనాలు రాలేదని మండల ఈజీఎస్ ఉద్యోగులు ఆవేదన వ్యక్త చేశారు. బుధవారం ఈజీఎస్ ఏపీఓ రాజ్‌కుమార్, టీఏలు, కార్యాలయ సిబ్బంది తమకు వెంటనే వేతనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు. తమకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమకు వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు.

ఈజీఎస్ సిబ్బంది నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఈజీఎస్ సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీఓ అనీల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి సంజీవచారి, రాజు, ఈసీ సురేందర్ మాట్లాడుతూ.. నిత్యం విధుల్లో భాగస్వాములు అవుతున్న తమకు నెలవారీగా వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు.